క్లుప్తంగా

సద్దుల బతుకమ్మ

వాజేడు: మండల పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం సద్దుల బతుకమ్మ పండుగను వైభవంగా నిర్వహించారు. అమావాస్య తెల్లారి ఎంగిలి పూలను బతుకమ్మ ఆడిన పెద్ద గొళ్లగూడెం, నాగరం, జగనాథపురంలోని కొన్ని వాడల మహిళలు శుక్రవారం సద్దుల బతుకమ్మలను ఆడారు. అలాగే రామాలయం, రజక వాడలో తమ వీధిలో ఒక రైతు మృతి చెందడంతో సద్దుల బతుకమ్మను శుక్రవారం నిర్వహించారు. పూలతో పెద్ద పెద్ద బతుకమ్మలను పేర్చిన మహిళలు మేల తాళాలతో ఇంటి నుంచి గద్దెల వరకు తీసుకువెళ్లారు. బతుకమ్మలను గద్దెల చుట్టూ ఉంచి ఆట పాటలతో అలరించారు.

భక్తుల సౌకర్యార్థం మెట్ల నిర్మాణం



ములుగు రూరల్: మండలంలోని కొత్తూరు శివారులోని దేవునిగుట్టకు అటవీశాఖ ఆధ్వర్యంలో మెట్ల మార్గం నిర్మాణం చేపడుతున్నారు. ఈ మేరకు శుక్రవారం దేవుని గుట్ట లక్ష్మీనర్సింహస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మెట్ల మార్గాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లక్ష్మీనర్సింహ స్వామి ఆలయానికి నడక దారి లేక భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని అటవీశాఖ ఆధ్వర్యంలో ఇటీవల మెట్ల మార్గం ఏర్పాటు చేసేందుకు పనులు ప్రారంభించారని అన్నారు. భక్తుల సౌకర్యార్థం అధికారులు చేపట్టిన పనులు అభినందనీయమని అన్నారు. ఇప్పటి వరకు ఆలయనికి చేరుకునేందుకు 600 మీటర్ల మేర పనులు పూర్తయయ్యాని అన్నారు. మరో వంద మీటర్లు మెట్లు నిర్మాణమయితే పూర్తి స్థాయికి చేరుకుంటాయని అన్నారు.

మద్యం మత్తులో ఇరువర్గాల ఘర్షణ

- ఇద్దరికి తీవ్రగాయాలు



ములుగు రూరల్: మండలంలోని మల్లంపల్లి వైన్‌షాపు వద్ద ఇరువర్గాలు మద్యం మత్తులో ఘర్షణకు పాల్పడిన సంఘటన శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. తెలిసిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా శాయంపేట మండలం ల్యాదెళ్ల గ్రామానికి చెందిన ఈసంపెల్లి మహేష్, ములుగు జిల్లా జంగాలపల్లి గ్రామానికి చెందిన మారపాక మల్లికార్జున్ అనే ఇద్దరు మల్లంపల్లి మద్యం షాపులో సిట్టింగ్ ప్రాంతంలో మద్యం తాగుతున్నారు. అదే మద్యం షాపులో మద్యం తాగుతున్న గుర్తు తెలియని వ్యక్తులతో మాటమాట పెరిగి గొడవకు దారితీసింది. దీంతో తాగిన మైకంలో బీరు సీసాలతో మహేష్, మల్లికార్జున్‌లపై దాడికి పాల్పడ్డారు. మహేష్‌కు మెడ భాగంలో తీవ్ర గాయం కాగా రక్తపు మడుగులో కొట్టి మిట్టాడుతుండగా పక్కనే ఉన్నవారు పోలీసులకు సమాచారం అందించారు. దాడికి పాలఏడిన వ్యక్తులు పోలీసులు చేరుకునే సమయానికి పారిపోయారని తెలిపారు. దీంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు చికిత్స నిమిత్తం మహేష్, మల్లికార్జున్‌లను ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించి అక్కడి నుంచి మెరుగైన వైద్యం వరంగల్ ఎంజీఎంకు కోసం తరలించారు.

రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురికి గాయాలు

వాజేడు: వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురికి గాయాలయ్యాయి. గురువారం రాత్రి వాజేడుకు చెందిన జాక నాగేంద్ర ద్విచక్ర వాహనంపై ఏటూరునాగారం వైపు వెళుతూ పూసూరు వద్ద గోదావరి బ్రిడ్జిని ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో నాగేంద్రకు కాలు విరిగింది. అతడు ప్రస్తుతం వరంగల్ ఎంజీఎంలో వైద్యం పొందుతున్నాడు. మండల పరిధిలోని దూలాపురం వద్ద ఆటో ద్విచక్ర వాహనం ఢీ కొన్న ఘటనలో ఆటోలో ఉన్న ముగ్గురితో పాటు ద్విచక్ర వాహనదారుడికి గాయాలు అయ్యాయి. అదే విధంగా శుక్రవారం ఉదయం మండల కేంద్రంలో ఆగి ఉన్న ద్విచక్రవాహనాన్ని ఒక వ్యక్తి ద్విచక్రవానంపై వస్తూ ఢీ కొనడంతో అతడి కాలుకు, తలకు గాయాలయ్యాయి.

కమిటీ ఎన్నిక

శాయంపేట : మండలంలోని గట్లకానిపర్తిలో గ్రామ అభివృద్ధి కమిటీని శుక్రవారం గ్రామ పెద్దలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కన్వీనర్లుగా బొమ్మకంటి ముత్యాలు, నాగరాజు, పెద్దిరెడ్డి సుభాష్ రెడ్డి, సముద్రాల లింగమూర్తి, నరెడ్ల రాంబాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామస్తుల అభిప్రాయం మేరకు గ్రామానికి వైకుంఠ రథం వాహనం సమకూర్చడం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, శ్మశానవాటిక, ప్రధాన కూడళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు, గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటు గురించి పని చేయాలని ఏకగ్రీవంగా తీర్మానాలు చేశారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు



గోవిందరావుపేట: పూజల అనంతరం భక్తులతో మంత్రి సీతక్క



ఏటూరునాగారం: బలిహరణ కార్యక్రమం చేస్తున్న అర్చకులు



బోరునర్సాపురంలో శివపార్వతుల కల్యాణం జరిపిస్తున్న పూజారులు



మంగపేట: రాజుపేటలో..



మొగుళ్లపల్లి: కుంకుమార్చన పూజలో మహిళలు



భూపాలపల్లి రూరల్: పూజల్లో పాల్గొన్న భక్తులు



వెంకటాపురం(కె): అన్నదాన కార్యక్రమానికి హాజరైన ఎస్సై తిరుపతి రావు



కాటారం: మహిషాసురమర్దిని అలంకరణలో అమ్మవారు

మొగుళ్లపల్లి: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం తొమ్మిదో రోజు అమ్మవారు మహిషాసురమర్దిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మండల కేంద్రంలోని శివాలయం దగ్గర కొలువుదీరిన దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు ప్రసాదలను అందజేశారు. అలాగే కుంకుమర్చన హోమం నిర్వహించారు. భజనమండలి సభ్యులు పంచాయతీ పాలకవర్గం సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి పట్టణంలోని పక్కీరు గడ్డలో ఏర్పాటు చేసిన దుర్గమాత మండపంలో శుక్రవారం బీజేపీ పట్టణ అధ్యక్షుడు సామల మధుసూదన్‌రెడ్డి–రమాదేవి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్న వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దుర్గామాత కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాటారం: మండల కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన దుర్గామాత, లక్ష్మీదేవర ఆలయంలో ఏర్పాటు చేసిన అమ్మవారికి పూజలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం దుర్గామాత మహిషాసురమర్దిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు అనంతుల శ్రీనివాస్, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

గోవిందరావుపేట: దుర్గామాత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని చల్వాయి గ్రామంలో ఉన్నటువంటి శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన అమ్మవారిని రాష్ట్ర పంచాయతీ రాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దుర్గామాత అమ్మవారు శుక్రవారం మహిషాసురమర్దిని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పూజారులు గోవర్దన కిరణ్ చార్యులు, సలేంద్ర రాజేంద్రచారి, క్రాంతి మంత్రి సీతక్కకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమంలో మంత్రి పాల్గొని భక్తులకు స్వయంగా వడ్డించారు. ఈ కార్యక్రమంలో శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు వీరమాచినేని వెంకటేశ్వరరావు, కార్యదర్శి మూల కుమార్, కమిటీ సభ్యులు వాసం స్వామి, గింజపెల్లి కిషోర్, కాసర్ల రాంబాబు, పాపక సమ్మయ్య, కొంపెల్లి కృష్ణారెడ్డి, పంగ రవీందర్, సలేంద్ర రాజుకుమార్, వాసం రాకేష్, రావుల సంజీవ్, నాయకులు సూరపనేని నాగేశ్వరరావు, కొంపెల్లి శ్రీనివాస్ రెడ్డి, జెట్టి సోమయ్య, చింత క్రాంతి, గుండెబోయిన నాగలక్ష్మి అనిల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మంగపేట: మండల కేంద్రంలోని ఉమా చంద్రశేఖరస్వామి ఆలయంలో శ్రీ ఉమాదేవి అమ్మవారు శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా భక్తులకు మహిషాసురమర్దిని అలంకరణలో శుక్రవారం దర్శనమిచ్చారు. అర్చకులు విస్సావఝుల నరేష్‌శర్మ మహిషాసుర మర్దినిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులతో సామూహిక కుంకుమ పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రి 08 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను చేపట్టి కూష్మండ బలిహరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. బోరునర్సాపురంలోని శ్రీ కనకదుర్గమ్మ ఆలయంలో ఆలయ పూజారులు మానుపెల్లి వేణు, పల్లపు హరీష్, కుంజ సురేష్, కొయ్యడ శివరమకృష్ణయ్య శివపార్వతుల కల్యాణ మోత్సవాన్ని నిర్వహించారు. మండలంలోని రాజుపేట శ్రీ వేణుగోపాల స్వామి ఆలయం, తిమ్మంపేట, రమణక్కపేట, కమలాపురం, మల్లూరు, నర్సింహాసాగర్, చెరుపల్లి తదితర గ్రామాల్లో అమ్మవారు తొమ్మిదో రోజు మహిషాసురమర్దిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

ఘనంగా బలిహరణ కార్యక్రమం

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో మహిషాసురమర్దిని అవతారంలో భాగంగా శుక్రవారం రాత్రి బలిహరణ కార్యక్రమాన్ని చేపట్టారు. అర్చకులు యల్లాప్రగడ నాగేశ్వర్‌రావుశర్మ ఎనిమిది దిక్కుల ఎనిమిది గుమ్మడికాయలతో దిష్టితీసి ప్రత్యేక పూజలు చేశారు. ఎర్రపు అన్నం, కుంకుమ, పసుపుతో అమ్మవారికి పూజలు చేశారు. అలాగే కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద భవాని మాలదారులు, అర్చకులు రాధాకృష్ణశర్మ డప్పుచప్పుళ్లతో మండపం నుంచి బయలుదేరి బొడ్రాయి వద్దకు చేరుకున్నారు. అక్కడ అప్పటికే మహిషాసురమర్దిని అవతారం వేసుకున్న భవాని స్వాములు డప్పుచప్పుళ్లకు నృత్యాలు చేస్తూ గుమ్మడికాయలను కొట్టారు.

వెంకటాపురం(కె): దేవీ శరన్నవరాత్రి వేడుకల్లో శుక్రవారం అమ్మవారు భక్తులకు మహిషాసురమర్దినిగా దర్శనమిచ్చారు. భక్తులు మండపాల వద్ద ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పత మార్కెట్ సెంటర్‌లో ఉత్సవ మండపం వద్ద ఎస్సై కొప్పుల తిరుపతిరావు అన్నదాన కార్యక్రమానికి హాజరైయ్యారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు రాపోలు సంతోష్, ఎట్టి శ్రీను, కలకోట సంతోష్ తదితరులు ఉన్నారు.

వరద బాధితులకు అండగా..



ఏటూరునాగారంలో కిట్లను పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ రాజ్యలక్ష్మి, ఫౌండేషన్ సభ్యులు

ఏటూరునాగారం: వరద బాధితులకు అండగా ఎస్‌కే ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ నిలిచిందని ఏటూరునాగారం ఎంపీడీఓ రాజ్యలక్ష్మీ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎస్‌కే ఫౌండేషన్ ద్వారా 107 మంది వరద బాధితులకు నిత్యావసర వస్తువలతో పాటు దుప్పట్లు, ఆహార పదార్థాలను ఎంపీడీఓ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇటీవల రామన్నగూడెం, రాంనగర్, ఓడవాడ ప్రాంతాల్లోని ముంపు బాధితులకు ఆహార పదార్థాలు, దుప్పట్లు అందించడం అభినందనీయమన్నారు. గతంలో కూడా కొండాయి, మల్యాలలో కూడా ఎస్‌కే ఫౌండేషన్ సభ్యులు నిత్యావసర సరుకులను అందజేశారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కే ఫౌండేషన్ అధ్యక్షుడు నొబెల్ రాజు, ప్రతినిధి రాజశేఖర్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు కిట్లు పంపిణీ



కన్నాయిగూడెంలో..

కన్నాయిగూడెం మండలంలోని తదితర గ్రామాల్లో ఉన్న 107 మంది వరద బాధితులకు ఎస్‌కే ఫౌండేషన్ ద్వారా నిత్యావసర వస్తువులు, దుప్పట్లను అందజేసినట్లు ఎంపీడీఓ అనిత తెలిపారు. శుక్రవారం కన్నాయిగూడెం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో వరద బాధితులకు ఈ కిట్లను అందజేశామన్నారు. కార్యక్రమంలో ఎస్‌కే ఫౌండేషన్ అధ్యక్షుడు నొబెల్ రాజు, రాజశేఖర్, సుదీర్ పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్ చేయూత



అనిల్‌కు దుస్తులు అందిస్తున్న హెడ్ కానిస్టేబుల్

టేకుమట్ల: మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన కాసాని అనిల్ అనే వ్యక్తి శుక్రవారం మండల కేంద్రానికి వ్యక్తిగత పనులపై వచ్చి అపస్మరణ స్థితికి చేరుకున్నాడు. దానికి తోడు పిట్స్ రావడంతో వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై గోగికారి ప్రసాద్ ఆదేశాల మేరకు హెడ్ కానిస్టేబుల్ మల్లన్న 108 వాహనంలో అతడిని చిట్యాల సివిల్ ఆస్పత్రికి తరలించి చికిత్సనం దించారు. పండగ వేళ అనిల్ ఆస్పత్రి పాలు కాగా చలించిన హెడ్ కానిస్టేబుల్ మల్లన్న అతడికి నూతన వస్త్రాలను అందించారు. దీంతో ఆసుపత్రి సిబ్బంది, స్థానికులు మల్లన్నను అభినందించారు.

పేదలకు రేషన్ కిట్ల పంపిణీ



వెంకటాపురం(ఎం): దుప్పట్లను పంపిణీ చేస్తున్న మంత్రి సీతక్క

వెంకటాపురం(ఎం): మండల కేంద్రానికి చెందిన 100 మంది నిరుపేదలకు షెల్ ఇన్ఫ్రాటెక్ సహకారంతో దసరా స్పెషల్ రేషన్ కిట్స్‌ను మంత్రి ధనసరి సీతక్క అందజేశారు. అదే విధంగా మంత్రి సొంత నిధులతో 100 దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ దివాకర టీఎస్, తహసీల్దార్ సదానందం, ఎంపీడీఓ రాజు, కాంగ్రెస్ నాయకులు మిల్కూరి అయిలయ్య, బైరెడ్డి భగవాన్‌రెడ్డి, బండి శ్రీనివాస్, సిద్ధం రాఘవేందర్, మామిడిశెట్టి కోటి, జంగిలి రవి, చెన్నోజు శ్రీనివాస్, భూస సాంబయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

గోవిందరావుపేట: మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం సిద్దిపేట షెల్ ఇన్ఫ్రాటెక్ టెక్ సౌజన్యంతో 100 మందికి దసరా స్పెషల్ రేషన్ కిట్లను మంత్రి సీతక్క జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్‌తో కలిసి నిరుపేదలకు పంపిణీ చేశారు. అంతే కాకుండా మంత్రి సీతక్క తన స్వంత నిధులతో దుప్పట్లను వారికి అందజేశారు. ఎంపీడీఓ జవహర్ రెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వీరికి దసరా ఎంతో ప్రత్యేకం



మచ్చ కర్ణ



జన్నె రాగసుధ



బొద్దుల అర్చణ



బూడిద సురేందర్



మేడిదుల హరీశ్



జంగపెల్లి సమ్మయ్య



శివకుమార్‌రెడ్డి

టేకుమట్ల: పండగ వేళల్లో ఏదైనా శుభవార్త వింటే ఆ పండుగ వారికి ఎంతో ప్రత్యేకం.. జీవితాంతం గుర్తు ఉంటుంది. కాగా, ఇటీవలవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో మండల కేంద్రంతో పాటు, మండలంలోని పలువురికి ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు రావడంతో వారు నూతన ఉద్యోగులుగా కుటుంబంలో ఎంతో సంతోషంగా గడుపుతున్నారు. వారికి ఈ దసరా పండగ ప్రత్యేకమైంది. వారిలో మండల కేంద్రానికి చెందిన మచ్చ కర్ణ ఎస్‌జీటీ, అంకుషాపూర్ గ్రామానికి చెందిన జన్నె రాగసుధ ఎస్‌జీటీ, బొద్దుల అర్చణ ఎస్‌జీటీ పంగిడిపల్లి, బూడిద సురేందర్ ఎస్‌జీటీ పంగిడిపల్లి, మేడిదుల హరీష్ ఎస్‌జీటీ బూర్నపల్లి, జంగపెల్లి సమ్మయ్య వ్యాయామ ఉపాధ్యాయులు రామకి ష్టాపూర్(టి), మారం శివకుమార్‌రెడ్డి ఎస్ఏ (మ్యాథ్స్)లు ఉన్నారు. అలాగే ద్వారకపేట గ్రామానికి చెందిన పింగిళి పద్మ 2010 డీఎస్సీలో మెరిట్ సాధించగా బీఎడ్ అభ్యర్థులకు సర్టిఫికేట్ వెరిఫికేషన్ అనంతరం ఎస్‌జీటీగా అవకాశం లేదనడంతో ఇన్ని సంవత్సరాలుగా కోర్టులో కేసు వేయగా ఇటీవల డీఎస్సీ అభ్యర్థులతో వారికి సైతం అవకాశం కల్పించడంతో సంతోషం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉద్యోగం సాధించిన అభ్యర్థులే కాకుండా వారి కుటుంబ సభ్యులు ఈ దసరా పండగను ఎంతో సంతోషంగా గడుపుతున్నారు.

దసరా పండుగకు ఏర్పాట్లు



వెంకటాపురం(ఎం): బొడ్రాయి వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఐ శంకర్, ఎస్సై సతీశ్



ఏటూరునాగారం: మైదానంలో పూజకు ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక ప్రాంగణం



ఏటూరునాగారం: ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని ఓడవాడ ప్రాంతంలో రావణాసురుని వధ కు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఏటూరునాగారం దసరా ఉత్సవ కమిటీ రావణవధని నిర్వహించడానికి గ్రామంలో విరాళంగా సేకరించారు. విరాళాలతో రావణ వధ తో పాటు అదే మైదానంలో ఎంతో వైభవంగా జరిగే జమీ ఉత్సవానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. విద్యుత్ దీపాలను అలంకరించారు. దసరా వేడుకలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ శ్రీనివాస్, ఎస్ఐ తాజుద్దీన్ రావణాసురుడి వధ ప్రాంతాన్ని శుక్రవారం సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. బారీకేట్లను ఏర్పాటు చేసి రద్దీ లేకుండా చూస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ఇర్సవడ్ల వెంకన్న, నూక ప్రభాకర్, తుమ్మ మల్లారెడ్డి, తాడూరి రఘు, గండెపల్లి నర్సయ్య, అరున్, మహంతు, సప్పిడి రాంనర్సయ్య, అలువాల శ్రీనివాస్, ధన్నపునేని కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటాపురం(ఎం): మండల కేంద్రంలో శనివారం జరగనున్న దసరా ఉత్సవ ఏర్పాట్లను ములుగు సీఐ శంకర్ పరిశీలించారు. బొడ్రాయి వద్ద ఫెన్సింగ్‌ను ఏర్పాట్లు, బోనం తీసుకవచ్చే కార్యక్రమ వివరాలు, భద్రత ఏర్పాట్లను పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. దసరా ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని, అల్లర్లకు పాల్పడితే చర్యలు తప్పవని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై జక్కుల సతీష్, ట్రెయినీ ఎస్సై మహేష్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మిల్కూరి అయిలయ్య, గ్రామ పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

రోడ్డుకు మరమ్మతు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న తిరుపతి

రేగొండ: మండల కేంద్రం నుంచి పెద్దంపల్లి మీదుగా భాగిర్ధిపేటకు వెళ్లే రోడ్డును మరమ్మతులు చేయించాలని డిప్యూటీ తహసీల్దార్ అబ్దుల్ రజాక్‌కు డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తిరుపతి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చాలా సంవత్సరాల క్రితం నిర్మించిన రోడ్డుకు ఎలాంటి మరమ్మతులు చేయించకపోవడంతో గుంతలు ఏర్పడి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రోడ్డు ఇరువైపులా పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనపడక పోవడంతో ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరారు.